క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన బట్టేపాటి



ఇందుకూరుపేట : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని నూతనంగా ఎన్నికైన పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వారి నివాసంలో కలిసి శిరిడీ సాయిబాబా ప్రతిమను అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బాక్సింగ్ పోటీలకు 12 మంది ఎంపిక



పోటీలకు ఎంపికైన బాలబాలికలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సెయింట్ మేరిస్ కళాశాలలో బాక్సింగ్ ఎంపికలకు పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 22 మంది బాలబాలికలు పాల్గొన్నారు. వీరిలో 12 మంది ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైనవారు ఈనెల 12, 13వ తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

విధి నిర్వహణలో ఒత్తిడిని తగ్గించుకోవాలి



శిక్షణ ఇస్తున్న వైద్యులు

కొడవలూరు : విధి నిర్వహణలో ఒత్తిడిని తగ్గించేందుకు, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఫిజియోథెరిపీ దోహదపడుతుందని ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరిపీపై అవగాహన కలిగి ఉండడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమానికి ఫిజియోథెరిపీ డాక్టర్లు రమేష్, సంతోష్‌లు శిక్షకులుగా వ్యవహరించారు.

భానుడి భగభగలు

- అల్లాడుతున్న ప్రజలు



జనసంచారం లేని పట్టణ వీధులు

పొదలకూరు : మండల పరిధిలో భానుడి భగభగలు పెరుగుతున్నాయి. ఎండలు నిప్పుల కొలిమిగా మారుతున్నాయి. పట్టణం, గ్రామాల్లో ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. తీవ్ర ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 11 గంటలకే పట్టణంలోని వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. పిల్లలను ఉదయం 11 గంటల తర్వాత బయట తిరగనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వైద్యులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

మిద్దెపై నుంచి పడి వృద్ధురాలి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని విద్యాసదన్ వీధిలో నివాసముంటున్న ఎస్.సుగుణమ్మ(74) మిద్దెపై బూజు దులుపుతూ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హాస్పిటల్‌లో మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గడ్డిమందు తాగి..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని శాంతి నగర్‌లో గడ్డిమందు తాగి శేషారెడ్డి(70) అనే వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. శేషారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ఆధార్.. బేజార్

- సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్‌కు మంగళం
- మండల పరిధిలో సేవలు బంద్
- ఈకేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- మండుటెండల్లో గూడూరుకు పరుగులు



మనుబోలు సచివాలయం-2లో గతంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం (ఫైల్)

మనుబోలు : మండల ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో 14 సచివాలయాలు ఉన్నా ఎక్కడా ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకులు ఇచ్చేందుకు కుటుంబంలో ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలనే నిబంధన పెట్టిన విషయం తెలిసిందే. దీంతో చాలా మందికి ఆధార్ అప్‌డేట్ కాకపోడంతో తెల్లరేషన్ కార్డుదారులు తిరుపతి జిల్లా గూడూరుకు పరుగులు పెడుతున్నారు.

సచివాలయ స్ఫూర్తి నీరుగారె

చిన్నచిన్న పనులకు ప్రజలు దూర గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే ఇబ్బందులను తప్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ స్ఫూర్తిని మంటగలుపుతూ సచివాలయ వ్యవస్థను పూర్తిగా నీరుగార్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయాల్లో పలురకాల సేవలు నిలిచిపోయాయి. సిబ్బంది నామమాత్రంగా హాజరవుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చట

గతేడాది మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో ఆధార్ కేంద్రాలు పెడుతున్నట్లు చెప్పారు. అయితే రెండు కేంద్రాల్లో డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో లేకపోవడంతో కేవలం మనుబోలు మండల కేంద్రంలోని సచివాలయం-2లో మాత్రమే ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఇది కూడా మూణ్నాళ్ల ముచ్చటే అయింది. రెండు నెలల తరువాత ఇక్కడి డిజిటల్ అసిస్టెంట్ లాంగ్ లీవ్ పెట్టడంతో ప్రస్తుతం మండలంలో ఎక్కడా ఆధార్ సేవలు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో ప్రజలు చిన్నచిన్న పనులకు కూడా సమీపంలోని టౌన్‌లకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఇకనైనా మండలంలో ఆధార్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ బాధలు



అసలే వేసవి కాలం. ఈ ఎండల్లో ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం గూడూరుకు వెళ్లి చేయించుకోవాలంటే చాలా కష్టంగా ఉంటుంది. మండలంలో ఎక్కడా ఆధార్ సేవలు లేకపోవడంతో గూడూరులో కూడా పెద్ద క్యూలైన్ ఉంటోంది. మండే ఎండల్లో ప్రజలకు ఈ బాధలెన్నాళ్లు.

– ఆవుల తులసిరాం, జట్లకొండూరు

ఆధార్ కష్టాలను తొలగిస్తాం



మండలంలో ఆధార్ సేవలు అందుబాటులో వున్న ఏకైక కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ లాంగ్ లీవ్ పెట్టడంతో ప్రస్తుతం ఆధార్ సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఐటీడీఏ ఆధ్వర్యంలో ఒక్కో వారం ఒక్కో మండలంలో ఆధార్ సేవలు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– జలజాక్షి, ఎంపీడీఓ, మనుబోలు

గర్భిణులకు పోషకాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వైద్య సిబ్బంది

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా 9వ తేదీన పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం భారతి హోమ్ కేర్ హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ చేతుల మీదుగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గర్భిణులు దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారులు పద్మావతి, మల్లికార్జున్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శిరీష, శాస్త్రి, అనూరాధ పాల్గొన్నారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

పొదలకూరు : నోటి ఆరోగ్యంపై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. మార్చి 20 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ప్రపంచ నోటి ఆరోగ్య మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ నుంచి గేటు సెంటరు వరకు ర్యాలీని కొనసాగించారు. దంత సంరక్షణపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం రోగులకు ఉచితంగా టూత్ పేస్టులు, మౌత్‌వాష్‌లు అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు రాధా తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



మనుబోలు : పూజలందుకుంటున్న సీతారాములు



ముత్తుకూరు : కృష్ణపట్నంలో ప్రత్యేకాలంకరణలో సీతారాములు

మనుబోలు : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మనుబోలు కోదండరామపురంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో సీతారాములకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు సాయికుమార్‌శర్మ సీతారాములకు పంచామృతాభిషేకం గావించి ప్రత్యేకాలంకారం చేసి విశేష పూజలు జరిపించారు. వేమూరు శ్రీనివాసులురెడ్డి-సృజనమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా కల్యాణం

ముత్తుకూరు : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కృష్ణపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణ వేడుక నేత్రపర్వంగా జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన వేడుకను స్థానికులే కాకుండా చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా తిలకించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



ఇస్కపాళెం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇస్కపాళెం సెంటర్‌లో ఆందోళన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం సమంజసం కాదన్నారు. పెంచిన గ్యాస్, పెట్రో, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బీజేపీతో అంటకాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకునేలా కేంద్ర పెద్దలను ఒప్పించాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు మారుబోయిన రాజా, పార్టీ నాయకులు బండి శౌరి, మోచర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, ఈదూరు జానకి, ఈదూరు సూర్యనారాయణ, నెల్లిపూడి మణి, ఇంగిలాల పెంచాలయ్య, కత్తి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

3డే ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో 3డే ఫెస్ట్(మూడు రోజుల పండగ) పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. వీటిని కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, గౌరవాధ్యక్షురాలు శ్రీలక్ష్మిల చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. కళాశాలలో ఈనెల 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పండగ నిర్వహిస్తున్నామన్నారు. 16న స్పోర్ట్స్ ఫెస్ట్, 17న టెక్నికల్ ఫెస్ట్, 18న కల్చరల్ ఫెస్ట్‌లు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సి.ప్రకాష్‌రావు, హజరత్తయ్య, ఏఓ కె.గిరీష్ పాల్గొన్నారు.

రైల్లోంచి పడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మనుబోలు : రైల్లోంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మనుబోలు, గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య కండలేరు వంతెన వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రైల్వే సిబ్బంది కథనం మేరకు.. విజయవాడ నుంచి చెన్నై వెళ్లే మార్గంలో కండలేరు వంతెన వద్ద ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రెడ్‌కలర్ కట్ బనియన్, బ్లూకలర్ జీన్స్ ధరించి ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెంలో ఎండీయూ వాహన ఆపరేటర్ ఇంట్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి భారీగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ కె.నరసింహారావు కథనం మేరకు.. సూరాయపాళెంలో రేషన్ బియ్యం అందజేసే ఎండీయూ వాహన ఆపరేటర్ కోళ్లకాడి పెంచలప్రసాద్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ప్లాస్టిక్ గోతాలలో 50 కిలోల వంతున 42 బస్తాలను గుర్తించారు. మొత్తం 2,100 కిలోల బియ్యంగా లెక్కకట్టారు. పెంచలప్రసాద్‌పై 6-ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్స్ డీటీ రవికి అప్పగించారు. విజిలెన్స్ అధికారులకు గ్రామం నుంచి అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించినట్లుగా తెలుస్తోంది. దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ జీఎస్ కృష్ణప్రసాద్, ఏఈఈ బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పొదలకూరులో భారీ చోరీ

- రెండిళ్లల్లో దొంగతనం
- బంగారు, వెండి, నగదు అపహరణ



గ్రిల్స్ కట్ చేసిన దృశ్యం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్, కాకుమాని లేఅవుట్లలో భారీ చోరీలు జరిగాయి. ఒకరేమో తిరునాళ్లకు ఊరెళ్లి వచ్చేలోగా ఇంటిని దోచేయగా, మరొకరు ఉద్యోగరీత్యా బయటి ప్రాంతానికి వెళ్లి వచ్చేలోగా దొంగతనం జరిగింది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. శ్రీనివాస లేఅవుట్లో నివాసం ఉంటున్న పట్టణంలోని కాకతీయ కాలేజీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న టి.ప్రభాకర్ సోమవారం కుటుంబసమేతంగా చేజర్ల మండలం చీర్లవారికండ్రికలో రాములోరి తిరునాళ్లకు వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి పరిశీలించగా తలుపులను తొలగించి బీరువా, కబోర్డుల్లోని 15 సవర్ల బంగారు నగలు, 1.5 కిలోల వెండి వస్తువులు, రూ.లక్ష నగదును అపహరించినట్లు గుర్తించారు. కాకుమాని లేఅవుట్లో నివాసం ఉంటున్న మొగల్ అల్లాభక్షు ఉద్యోగానికి వెళ్లారు. మధ్యాహ్నం ఆయన భార్య ఇంటికి తాళం వేసుకుని ఊరెళ్లారు. ఈ క్రమంలో ఇంటి కిటికీ గ్రిల్స్‌ను కట్ చేసి లోనికి ప్రవేశించిన ఆగంతకులు పది సవర్ల బంగారు నగలను దోచుకుని వెళ్లారు. అయితే ఇంట్లో నగదును తాకలేదని తెలిసింది. బాధితులు పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు.

అంత్యక్రియలకు అభ్యంతరం

- మృతదేహంతో గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోవూరు : గిరిజనుడి అంత్యక్రియల విషయం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఈ ఘటన కోవూరు మండలం నందలగుంటలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నందలగుంటలో నివాసం ఉంటున్న గిరిజనుల్లో ఎవరైనా మృతిచెందితే ఇప్పటివరకు కోవూరులోని శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. కాగా నందలగుంట సమీపంలోనే వరి పొలాలు ఉన్నాయి. ఆ పక్కనే గతంలో జగనన్న కాలనీకి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో అక్కడ వాగు కాలువ పోరంబోకు స్థలాన్ని స్థానిక రైతులు శుభ్రపరచడంతో తమకు ఆ స్థలంలోనే శ్మశానం కేటాయించాలని ఇటీవల కలెక్టర్‌కు గిరిజనులు వినతిపత్రాన్ని అందజేశారు. అయితే బుధవారం నందలగుంట గిరిజన కాలనీ వాసి అద్దూరు పెంచలయ్య మృతిచెందారు. ఆ మృతదేహానికి తాము శ్మశానానికి అడుగుతున్న స్థలంలోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు, జగనన్న కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడికి చేరుకుని అంత్యక్రియలు జరపడానికి వీల్లేదంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్, తహసీల్దార్ నిర్మలానందబాబా తదితరులు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరుపక్షాలతో మాట్లాడారు. మీ శ్మశాన విషయం కలెక్టర్ పరిశీలనలో ఉందని, స్థలం కేటాయించే వరకు గతంలో ఎక్కడైతే అంత్యక్రియలు జరుపుకుంటున్నారో అక్కడే జరుపుకోవాలని చెప్పడంతో కొన్ని గంటల పాటు అక్కడ అంత్యక్రియలకు అంతరాయం ఏర్పడింది. చివరకు గిరిజనులు పెంచలయ్య మృతదేహాన్ని కోవూరులోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు



కొడవలూరు : రామన్నపాళెంలో ఆధార్ చేయించుకుంటున్న గిరిజనులు



ముత్తుకూరు : ఆధార్ కోసం బారులుతీరిన గిరిజనులు

కొడవలూరు : మండలంలోని రామన్నపాళెం సచివాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రానికి మంచి స్పందన లభించింది. గ్రామంలో గిరిజన కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఇక్కడ ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో చిన్నారులతో పాటు వివిధ వయస్సుల్లోని గిరిజనులకు ఆధార్ చేయించారు. పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, జి.రమేష్, కె.శీనయ్య, ఐటీడీఏ అధికారి సుధాకర్, వీఆర్వో వి.సుబ్రహ్మణ్యం, డీఏలు ఎ.ప్రవీణ్, శివయ్య, మహిళా పోలీస్ జి.ప్రభావతి, ఈఈ టి.గౌరి, వీపీఏ ఆర్.నిహారిక పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై, ఆధార్ నమోదు చేయించుకున్నారు. ఈ శిబిరంలో 60 మందికి ఆధార్‌కార్డులు అందజేశారు. ఐటీడీఏ ఆపరేటర్లు పెంచలతేజ, పెంచలయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పొదలకూరు : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ



పొదలకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పొదలకూరు : గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా స్థానిక సర్సారెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ వెయ్యి రోజుల సంరక్షణ గురించి గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన సమయం నుంచి కాన్పు అయ్యే వరకు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, కృషి విజ్ఞాన్ కేంద్రం కో-ఆర్డినేటర్ శివజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, రత్నమ్మ, వెంకటకుమారి, అమరావతి, మణెమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

సూరాయపాళెంలో..

మండలంలోని సూరాయపాళెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఏర్పాటు చేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు శ్రీనివాసులు, కుమారి, మహిత, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సునీత, చంద్రకళ, అనసూయ, సుధా పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పిడూరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీలు విజయమ్మ, మహాలక్ష్మి, నాగమణి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాలున్న ఆహారంతోనే ఆరోగ్యం

కొడవలూరు : పోషకాలున్న ఆహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని గుండాలమ్మపాళెం మజరా కొండాయపాళెం గిరిజన కాలనీలో పోషకాహార విలువలపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరికీ అందుబాటు ధరల్లో ఉండే ఆకుకూరలు, తృణ ధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, సంపూర్ణ, మమత, రాణి, రేణుక పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పక వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని బొడ్డువారిపాళెంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం బుధవారం జరిగింది. పుట్టిన బిడ్డకు రెండేళ్లు పూర్తయ్యే వరకు వేయించాల్సిన టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.మధుసూదనమ్మ, కె.ఎస్తేరమ్మ, కె.సునీత, ఎ.హరిప్రియ పాల్గొన్నారు.



కొడవలూరు : గుండాలమ్మపాళెం మజరా కొండాయపాళెంలో..



మనుబోలు : పిడూరులో..



కొడవలూరు : బొడ్డువారిపాళెంలో..